క్లుప్తంగా

అవార్డ్‌కు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డ్స్ 2025లో గొల్లపూడి పంచాయతీకి ఆత్మనిర్భర్ పంచాయత్ ప్రత్యేక అవార్డ్ రావడానికి సహకరించిన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు సంబధిత అధికారులు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి లావణ్య, స్పెషల్ ఆఫీసర్ (ఈఓఆర్‌డీ) మన్నె వెంకట దుర్గా వరప్రసాద్, గొల్లపూడి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వరూపరాణి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక బహూకరించారు. కేంద్ర అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చోటుచేసుకోవడం, అందునా గొల్లపూడి గ్రామ పంచాయతీకి ఆత్మనిర్భర్ అవార్డ్ దక్కటం తమ సమష్టి కృషి ఫలితంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అందుకు అన్ని విధాల సహకరించి వెన్నుదన్నుగా నిలబడినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

50వ డివిజన్‌లో చలివేంద్రం ఏర్పాటు



విధిపేట(విజయవాడపశ్చిమ): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడం ఎంతో పుణ్య కార్యం అని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు బంకా చాముండేశ్వరి అన్నారు. పిపుల్స్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక 50వ డివిజన్, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చాముండేశ్వరి చలివేంద్రాన్ని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మోహిత్, సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ సెషన్–2లో విద్యార్థి ప్రతిభ



రాజులపాటి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని సూరాయపాలెం నారాయణ కాలేజీ విద్యార్థి జేఈఈ సెషన్–2లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మైలవరం నియోజకవర్గం పుల్లూరు (మండలం)కు చెందిన రాజులపాటి శ్రీనివాసరావు ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతూ ఇటీవల నిర్వహించిన జేఈఈ సెషన్–2లో పరీక్షలు రాశారు. జాతీయ స్థాయిలో 99.86 శాతం మార్కులతో ఓబీసీ ఎన్‌సీఎల్ కేటగిరిలో 403వ ర్యాంక్, సీఆర్ఎల్ ర్యాంక్ 2,222 సాధించినట్లు కళాశాల డీన్ పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చి చదువుకుంటూ తన లక్ష్యాన్ని చేరుకునే దిశగా జాతీయ స్థాయిలో మంచి ర్యాంక్ సాధించటం గర్వకారణమని పేర్కొన్నారు. శ్రీనివాసరావును కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ధైర్యంగా అడుగులు వేస్తే విజయాలు సొంతం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): యువత వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో భయపడకుండా ధైర్యంగా అడుగులు వేస్తే విజయాలు వరిస్తాయని ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసిరెడ్డి మురళీకృష్ణ సూచించారు. పొట్టిశ్రీరాములు, చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ క్రియేషన్ అండ్ ఇన్నోవేషన్ డేను పురస్కరించుకొని 'ఫ్రమ్ ఇడియాస్ టూ ఇంప్యాక్ట్ – ది పవర్ ఆఫ్ ఇన్నోవేటివ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్'పై కళాశాలలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయాలు, స్టార్టప్ సాధ్యత, మార్కెట్ అవసరాలను గుర్తించి వినూత్న పరిష్కరాలను రూపొందించాలని సూచించారు. యువత వ్యాపార దృక్పథాలను పెంపొందించుకొని సృజనాత్మకంగా లోచనలు చేస్తే విజయాలు సొంతం అవుతాయని స్పష్టంచేశారు. ప్రతి రంగంలోనూ అపజయాలు ఉంటాయని, వాటికి భయపడితే ఏ రంగంలోనూ విజయాలు ఉండవని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో దేశ అభ్యున్నతికి యువ ఆవిష్కర్తల పాత్ర చాలా కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, అధ్యాపకులు వై.సుధచంద్ర, వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.శివగోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. రాకపోకలకు చింతలు

- వైఎస్సార్ కాలనీ రోడ్లు గుంతల మయం
- బుడమేరు వరదతో మరింత అధ్వానం
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- కనీసం గుంతలను కూడా పూడ్చని వైనం



కాలనీ మెయిన్‌రోడ్డులో గోతులు



కాలనీలో అంతర్గత రోడ్ల దుస్థితి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సుమారు ఎనిమిది వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కాలనీలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రోడ్డులో ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. గతంలో చిన్న పాటి గుంతలుగా ఉన్న రోడ్లు, బుడమేరు వరద ముంపు కారణంగా మరింత అధ్వారంగా మారాయి. బుడమేరు వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కాలనీలో రోడ్లను బాగు చేస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు కాలనీ వైపు ముఖం కూడా చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెయిన్ రోడ్డులో పది అడుగులకో గొయ్యి

కాలనీలోకి ప్రవేశించే మెయిన్ రోడ్డులో పది అడుగులకు ఒక గొయ్యి చొప్పున ఉన్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మెయిన్ రోడ్డు ఆరంభంలోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు కనీసం అడుగు లోతులో గొయ్యి ఏర్పడి నెలలు కావస్తున్నాయి. ఇక కాలనీలోకి ప్రవేశించిన పావు కిలో మీటరు దూరంలోనే పెద్ద ఎత్తున గోతులు దర్శనమిస్తున్నాయి. సప్తగిరి బ్యాంక్, పోలీస్ అవుట్ పోస్ట్ ప్రాంతాలయితే ఇక చెప్పనవసరం లేదు. కనీసం కాలనీ నిర్మించి దశాబ్దాలు అవుతున్నా ఇంత వరకు రోడ్డును పునర్నిర్మించిందే లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కాలనీవాసులకు మరిన్ని సదుపాయాలను కల్పిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదంటున్నారు. కాలనీ మెయిన్ రోడ్డు మాత్రమే కాదని, అంతర్గత రోడ్లు కూడా ఎక్కడ చూసినా గోతులతో దర్శనమిస్తున్నాయని వివరిస్తున్నారు. గోతులమయంగా మారిన రోడ్లను పునర్నిర్మించడం మాట అటుంచి కనీసం గంపెడు మట్టి కూడా వేయలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

బుడమేరు వరదతో రోడ్లు ధ్వంసం

గత సెప్టెంబర్‌లో వచ్చిన బుడమేరు వరదతో కాలనీలోని రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దాదాపు 20 రోజుల పాటు వరద నీటిలోనే ఉన్న కాలనీలోని రోడ్లకు ఇప్పటికి కూడా కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవంటున్నారు. కాలనీలో ఇప్పటికే ఉన్న స్పీడ్ బ్రేకర్లకు తోడు ఈ గోతుల కారణంగా ప్రయాణం కష్టంగా మారిందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల కారణంగా కాలనీలోని మెయిన్ రోడ్డులో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకోవడమే కాకుండా వాహన చోదకులు గాయాల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు.

రోడ్లు కనిపించడం లేదా...!

కూటమి నేతలకు తమ కాలనీలో రోడ్లు కనిపించడం లేదా అని వైఎస్సార్ కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు ముగిసి ఏడాది పూర్తవుతున్న తరుణంలో కనీసం కాలనీలో రోడ్లు దుస్థితి తెలియనిదా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతలు కాలనీలోకి వచ్చిన ప్రతి సారి రోడ్ల గురించి వారి దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. పేద, సామాన్య ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న జక్కంపూడి కాలనీపై ప్రభుత్వ పెద్దలకు కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనవంతులు నివాసం ఉండే కాలనీలు, అపార్టుమెంట్ల వద్ద అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి పెద్దలు, పేదలు నివాసం ఉండే జక్కంపూడి కాలనీలో రోడ్ల దుస్థితిని కూడా చూడాలని వేడుకుంటున్నారు.



బుడమేరు కాల్వ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద గోతులు



కమ్యూనిటీ హాల్ వద్ద గోతులమయంగా రోడ్డు

పోలీస్ ప్రజావాణికి 100 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 100 ఫిర్యాదులను అందినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఉదయరాణి తెలిపారు. ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 48మంది, కుటుంబ కలహాలపై 18, మహిళా సంబంధిత నేరాలపై 9, మోసాలపై 11, ఇతర వివాదాలపై 14మంది ఫిర్యాదులు అందజేశారని వివరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ షన్ అధికారులను ఆదేశించినట్లు డీసీపీ తెలిపారు.

రేపు బీచ్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: బీచ్ కబడ్డీ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈనెల 23వ తేదీన గూడూరు మండలం మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కబడ్డీ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి పి.రవిబాబు తెలిపారు. 85 కేజీల్లోపు బరువు ఉన్న పురుషులు, 75 కేజీల్లోపు బరువు ఉన్న మహిళలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆరోజు ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9704063555 నంబరును సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు మే రెండో తేదీ నుంచి కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని రవిబాబు వివరించారు.

జంక్షన్ల అభివృద్ధితో కాలుష్య నివారణ



రామవరప్పాడు జంక్షన్ వద్ద జరుగుతున్న ఫౌంటేన్ పనులను పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని జంక్షన్లను అభివృద్ధి చేసి కాలుష్యాన్ని నివారించాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం రామవరప్పాడు రింగ్, టిక్కిల్ రోడ్డు, మదర్ థెరిసా జంక్షన్, ఆటో నగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, హెచ్‌టీ లైన్ రోడ్డు తదితర ప్రాంతాలను సందర్శించారు. రామవరపాడు రింగు వద్ద అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన జంక్షన్ వద్ద ఉన్న ఫౌంటేన్, మన విజయవాడకు కొత్త అలంకరణగా నిలిచిన యూనికాన్ (రెక్కల గుర్రం)ను పరిశీలించారు. జంక్షన్లను పచ్చని మొక్కలతో నింపి కాలుష్యాన్ని తగ్గించాలని అధికారులను ఆదేశించారు. మదర్ థెరిసా జంక్షన్ వద్ద జరుగుతున్న పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న సివేజ్ ట్రాన్స్ఫర్ ప్లాంట్‌ను పరిశీలించి త్వరతగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. హెచ్‌టీ లైన్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరెడ్డి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

26న ఎంఎస్ఎంఈ కనెక్ట్ కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 26వ తేదీన ఎంఎస్ఎంఈ కనెక్ట్–2025 పేరిట ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దాసరి దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోరీ హాస్పిటల్ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో 26వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. వ్యాపార పయనంలో అవసరమయ్యే సాహచర్యం, శిక్షణ, మార్గనిర్దేశం, మౌలిక సమాచారం ఈ శిక్షణలో అందిస్తున్నట్లు వివరించారు. ప్రముఖులు, అధికారులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు తదితర అంశాలపై అవగాహన కల్పించటంతో పాటు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాల కోసం 6305941717, 8919737517లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకూ శాశ్వత పరిష్కారం అందించాలని నగరపాలక సంస్థ అధికారులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయ కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు – పరిష్కార కార్యక్రమంలో ఆయా వివిధ ప్రాంతాల నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు, పట్టణ ప్రణాళిక సంబంధించి అత్యధికంగా 13 అర్జీలు ఉన్నాయి. ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి మూడేసి అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో వందలాది కుటుంబాలను ఆర్థికంగా దోచుకుని ఇబ్బందులకు గురిచేస్తున్న ఆర్థిక నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ డిమాండ్ చేశారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒక సాధారణ వ్యక్తి ఒకటి లేదా రెండు వాయిదాలు చెల్లించకపోతే నేరస్తుడు కానీ పాతబస్తీలోని నలుగురు వ్యక్తులు రూ.1000 కోట్లు కొట్టేస్తే మాత్రం ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. పాతబస్తీకి చెందిన ఒకరు 600 కుటుంబాల నుంచి సుమారు రూ.150 కోట్లు పైగా కొట్టేసి ఆస్తులు కొనుక్కుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చిట్టీలు, ఫైనాన్స్ పేరుతో 300 నుంచి 400 మంది ఖాతాదారులు, 200 మంది డిపాజిట్‌దారులను మోసం చేసి రూ.150 కోట్ల మేర ఆర్థిక కుంభకోణానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. అతని ఆస్తులను తక్షణమే జప్తు చేసి, అతని బారి నుంచి ఖాతాదారులు, డిపాజిట్‌దారుల భవిష్యత్ ఆర్థిక ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో ఒక ప్రముఖ ట్రస్ట్ ఆస్తిని కూడా అతను కొనుగోలు చేశాడని, దీనిపై కూడా అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేయాలన్నారు. విక్రయించే అధికారం ట్రస్ట్‌కు, కొనుగోలు చేసే అవకాశం అతనికి లేదని స్పష్టంచేశారు. ట్రస్ట్, ట్రస్టు సభ్యులు చేసిన వ్యవహారం, వారు చేసిన సంతకాలు, అందులో ఉన్న మార్కెట్ వ్యాల్యూ, సబ్ రిజిస్ట్రార్ వేల్యూ మధ్య తేడాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేయాలన్నారు. ఈ వ్యవహారాన్ని ఏదో రకంగా సర్దుబాటు చేసి 600 కుటుంబాలకు అన్యాయం చేసేలా ఒక ఆడిటర్ కొంతమంది రాజకీయ నాయకులతో కలిసి చక్రం తిప్పుతున్నారని విమర్శించారు. గోవిందరాజుల సత్రం ట్రస్ట్ ఇనాం భూమి వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మరో ఆర్థిక నేరగాడు సైతం పెద్ద ఎత్తున ప్రయివేట్ చిట్‌ఫండ్, జూవెలరీ, రియల్ ఎస్టేట్ పేరుతో రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు సేకరించి ప్రజలను నానా ఇబ్బందులు గురిచేస్తున్నారని విమర్శించారు.

హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం

రాష్ట్ర రజక సంఘం నాయకుల డిమాండ్



రాష్ట్ర ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న భాస్కరయ్య తదితరులు

ఇబ్రహీంపట్నం:కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటాలకు సిద్ధపడాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర ఏడో మహాసభలు సందర్భంగా రెండో రోజు సోమవారం స్థానిక ఎంవీఆర్ కళ్యాణ మండపంలో ప్రతినిధుల మహాసభ జరిగింది. 16 జిల్లాల నుంచి 180 మంది ప్రతినిధులు చర్చలకు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తెస్తామని చెప్పిన ప్రభుత్వం 11 నెలలుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రజకులపై దాడుల నివారణకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ ద్వారా రూ.1,000 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధికి ఖర్చు చేయాల పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ మాట్లాడుతూ.. 50 ఏళ్లు దాటిన రజక వృద్ధులకు పింఛను మంజూరు చేయాలని కోరారు. పలు తీర్మానాలు ఆమోదించారు. 45 మందితో నూతన పాలకవర్గం కమిటీ ఎన్నుకున్నారు. పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు కార్పొరేటర్ల పయనం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న వివిధ నగరపాలక సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధిని అధ్యయనం చేసేందుకు వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో నగర కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద వారి బస్సును మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు 24 మంది, కూటమి నుంచి 17 మంది, ఇద్దరు కోఆప్టెడ్ మెంబర్లతో పాటు యాత్ర సమన్వయకర్తలుగా డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కరుణాకర్‌బాబు, పీఆర్‌ఓ రజియా షాబినా, మరో ముగ్గురు సహాయక సిబ్బందితో బృందంగా వెళ్తున్నారు. కార్పొరేటర్ల బృందం ఈ నెల 22న బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్, 23న మైసూర్ మునిసిపల్ కార్పొరేషన్, 26న మధురై మునిసిపల్ కార్పొరేషన్, 28న నాగర్ కోయిల్ (కన్యాకుమారి) మునిసిపల్ కార్పొరేషన్, 29న తిరువనంతపురం మునిసిపల్ కార్పొరేషన్, మే మూడో తేదీన కొచ్చిన్ నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి, వివిధ ప్రాజెక్టులను పరిశీలించనుంది. ఆయా నగరాల్లో ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలు తీరు తదితర అంశాలను అధ్యయనం చేయనుంది.

వాస్తవ ఘటనలకు అద్దం పట్టిన కవితాగానం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

విజయవాడ కల్చరల్: పర్వతనేని బ్రహ్మయ్య, సిద్ధార్థ విద్యాసంస్థలు 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో నిర్వహించిన యువకవి సమ్మేళనం వాస్తవ సంఘటనలకు అద్దం పట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీనియర్ కవి డాక్టర్ రావులపాటి సీతారామారావు మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ తనదైన ముద్ర వేశారన్నారు. తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్యం పెను సంచలనం సృష్టించిందన్నారు. శ్రీశ్రీ కవిత్వం భూమార్గం పట్టి భూకంపం సృష్టించిందని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో కవిత్వం రూపురేఖలే మారిపోయానని, ఎందరో యువకులు కవిత్వం వైపు మళ్లారని వివరించారు.

యువతరం కదిలింది..

సినీపాటల రచయిత కట్టా సిద్ధార్థ, యువ కవి తంగిరాల సోని, మాస్టర్ మైండ్స్ ఇంటర్ విద్యార్థిని పీఎస్ఎస్ చిన్మయి, కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆర్.స్రవంతి, పి.ఎలిజిబెత్ రాణి, వైద్యవిద్యార్థిని నాగశెట్టి రూపశ్రీ, దంత కళాశాల విద్యార్థిని కుసుమమోనిషి, సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని జీ ధరణి, కేబీఎన్ కళాశాల అధ్యాపకుడు పవన్‌కుమార్, బీ భారతీబాయ్‌లు సమాజంలో నేడు జరుగుతున్న అనేక సంఘటలనలకు అక్షర రూపమిచ్చారు. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు సత్యశ్రీనివాస్, ఎస్.శివకుమార్ నిర్వహించారు.

ధ్యానం, యోగ సాధనతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న తుమ్మూరి దీప్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నిత్యం ధ్యానం, యోగ సాధన ద్వారా ఒత్తిడి తీవ్రతను తగ్గించుకోవటం ఎంతో సులభమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు తుమ్మూరి దీప్తి సూచించారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ ఆఫ్ వెల్ బీయింగ్ అండ్ మైండ్ ఫుల్ నెస్ అంశంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి దీప్తి మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ వాడకం మితిమీరడం వల్ల మానసిక ఒత్తిడి పెరగుతోందన్నారు. దీని వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తి తగ్గి చదువులో రాణించలేరన్నారు. బ్రీతింగ్ ఎక్సర్స్ సైజ్, చైతన్య క్రియా ధ్యానం సాధన చేయడం ద్వారా మెదడు క్రియలను అదుపులోకి తీసుకురావచ్చని సూచించారు. శ్వాస నియంత్రణ పద్ధతులు, క్రియా యోగ, ప్రాణిక్ హీలింగ్ అంశాలను ప్రయోగ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్య క్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, కంప్యూటర్స్ విభాగాధిపతి పి.రవీంద్ర పాల్గొన్నారు.

అత్తింటి వారి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురిచేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిట్టినగర్‌లోని పెనుమాక దేవదాసు వీధికి చెందిన తట్టపర్తి యామినికి గత ఏడాది డిసెంబర్‌లో తాడేపల్లిగూడెంనకు చెందిన నాగసాయితో వివాహమైంది. యామిని తల్లిది మతాంతర వివాహం. ఈ విషయాన్ని నాగసాయి తల్లిదండ్రులకు ముందుగానే చెప్పారు. అయితే పెళ్లయిన రెండు నెలల నుంచి యామినికి అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. అత్త మంగమ్మ, ఆడపడుచు భవాని, ఆమె భర్త వినయ్‌కుమార్ తరుచూ వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో యామినిని కాలువ వద్దకు తీసుకువెళ్లి 'దూకుతావా.. తోసేయమంటావా' అంటూ భర్త నాగసాయి వేధించాడు. అయితే చుట్టు పక్కల వారు ప్రశ్నించడంతో పక్కనే ఉన్న పొలాల్లోకి తోసేశాడు. ఫిబ్రవరిలో అర్ధరాత్రి ఇంటికి వచ్చి గొడవ పడి కొట్టడమే కాకుండా చేతికి ఉన్న గాజులతో గాయపరిచాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసి అత్తంటి వారి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఎస్ఎస్ ప్రీమియర్ లీగ్ విజేత కార్తీక్ సీసీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుజనా ఫౌండేషన్, కేశినేని ఫౌండేషన్, ఎంకే బేగ్ ట్రస్ట్ సహకారంతో అనిల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్ఎస్ఎస్ ప్రీమియర్ లీగ్‌లో వన్‌టౌన్‌కు చెందిన కార్తీక్ సీసీ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం అమ్మ క్యాటరర్స్, కార్తీక్ సీసీ టీం మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కార్తీక్ టీం విజేతగా నిలిచింది. అమ్మ క్యాటరర్స్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. కార్తీక్ సీసీ జట్టుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ రూ.లక్ష చెక్కు, అమ్మ క్యాటరర్స్ జట్టుకు ఎంఎస్ బేగ్ సహకారంతో రూ.50 వేల చెక్కు అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం:హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్ర గాయాలతో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చింతపల్లి రాజు (35) సోమవారం మృతి చెందాడు. మండలంలోని మూలపాడు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగిన విషయం తెలిసిందే. గొల్లపూడిలోని తన కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. మృతుడు రాజుకు 11 ఏళ్ల కుమార్తె ఉంది. భార్య గతంలోనే మరణించగా, ఇప్పుడు తండ్రి కూడా మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోలేని అనాథగా బాలిక మారింది.